# ఆన

## చట్టంతో వైద్యం తలపడినప్పుడు

ఆంగ్లమూలం

**డా॥ కల్యాణ్ సి. కంకణాల**



అనువాదం

**పిన్నమనేని మృత్యుంజయరావు**

# AANA

*Chattamtho Vaidyam Talapadinappudu*

In English
**Dr. Kalyan C. Kankanala**
kalyanckankanala@gmail.com

Translation
**Pinnamaneni Mrutyunjaya Rao**
77940 04466

© Writer / Translator

Published by
Samskruthi, Guntur

Publication No. 7

First Print
**29 August 2018**

Copies
**1000**

Cover Design
**Setlem Chandra Mohan**
94404 59194

**₹ 150.00**

For copies
**Dr. K. Krishna Mohan**
Devi Hospitals, Kurnool Road
Ongole - 2

and All Leading Bookshops

Printing
Sri Sri Printers
Vijayawada

# నాంది

"యువరానర్..." పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదన సాగుతోంది. "ఈ మనిషి వందలాది ప్రజల మరణాలకు బాధ్యుడు. ఇతడు హత్య, నరమేధం, తీవ్రంగా గాయపరచడం, రాజ్యానికి వ్యతిరేకంగా పోరు నడపడం వంటి చర్యల ద్వారా నేరస్తుడు."

కళ్ళజోడు సవరించుకుంటూ న్యాయమూర్తి తల ఊపాడు.

ప్రాసిక్యూటర్ వాదన కొనసాగించాడు, "వీటన్నిటినీ అతను స్వయంగా చేసుండకపోవచ్చు. కాని చట్టప్రకారం అతనా నేరానికి వహించాల్సిన బాధ్యతనుండి తప్పుకోలేడు. అతనిచ్చిన నిధులే లేకపోతే, అతను తర్ఫీదు చేసిన మనుషులు, అద్దెకు తెచ్చిన వాహనాలు లేకపోతే, ఇన్ని బాంబుపేలుళ్ళు జరిగేవి కావు. ఇంతమంది మనుషులు చనిపోయేవారు కాదు."

ఇక్కడొక క్షణం నాటకీయంగా ఆగి, ప్రాసిక్యూటర్ మళ్ళీ కొనసాగించాడు, "నిందితుడు నేరాన్ని స్వయంగా చేసి ఉండకపోవచ్చు. కానీ అతనిది అందులో ప్రధానమైన పాత్ర. అతనా నేరానికి సహాయపడ్డాడు, ప్రేరేపించాడు, సులువుగా జరిగేందుకు దోహదం చేశాడు."

న్యాయస్థానంలోని ప్రతిఒక్కరు అతను చెప్పేది శ్రద్ధగా విన్నారు. ప్రాసిక్యూటర్ గొంతు, పంఖా తిరుగుతున్న కీచుచప్పుడు తప్ప, కోర్టు హాలంతా నిశ్శబ్దంగా ఉంది.

"యువరానర్! రికార్డు దాఖలా లభ్యమయ్యే సాక్ష్యాలను బట్టి, నేరమూ దాని వెనకున్న ఉద్దేశ్యమూ కూడా నిస్సందేహంగా రుజువయ్యాయి. ఈ ముద్దాయికి మరణశిక్షే సరైనది"

# 1వ అంకము

## 1979

ఇంట్లోకి వెళ్ళడానికి మెట్లెక్కుతున్నప్పుడుగాని ఆకలితో కడుపు నకనకలాడు తున్న సంగతి తెలియలేదు. ఆస్పత్రి పైఅంతస్తులో నివాసం ఉంటే చాలా వెసులుబాట్లున్నాయి. ముఖ్యంగా రోగులకు అందుబాటులో ఉండొచ్చు. ఇప్పుడు మాత్రం తొందరగా భోజనం చేసే వీలుచిక్కిందని సంతోషపడుతున్నాను. నా ప్రియమైన ఇల్లాలు రమాదేవి ఈపాటికి వంట సిద్ధం చేసే ఉంటుంది. పోయి గబుక్కున తినెయ్యాలి. పొద్దునంతా చేసిన చాకిరికి నాలుగు ముద్దలు తిని ఒక మంచి కునుకు తీస్తే హాయిగా ఉంటుంది.

తెల్లారుజామున నాలుగింటికే పని మొదలయ్యింది. ఆసనలూటీల కొకటీ, టాన్సిల్స్ కొకటీ ఆపరేషన్లు చేశాక ఇక హడావిడి మొదలైంది. జీవితంలో మొదటిసారిగా ఆంత్రవాహికకు శస్త్రచికిత్స చేశాను. పాఠ్యపుస్తక జ్ఞానం ఎంతున్నా ఆపరేషన్ ప్రక్రియ ఎప్పుడూ సవాలుగానే ఉంటుంది. ఇవాళ అదే జరిగింది. ఎంతసేపు చూసినా ఆంత్రవాహికలో బెజ్జం ఎక్కడుందో కనిపించలేదు. రమాదేవిది గద్దకన్ను. అదృష్టవశాత్తూ తను నాకు తోడుగా ఉంది. కనిపెట్టేసింది. పొట్టలో ఒకటి, చిన్న పేగులో ఒకటి కోతలు పెట్టి కుళ్ళిన భాగాన్ని తీసేసి కుట్లు వేశాను.

రోగి ఒక వృద్ధమహిళ. ఆమె మత్తునుంచి కోలుకుని అంతా సవ్యంగా ఉందని అనిపించాకే నేను ఆపరేషన్ థియేటర్ వదిలి బయటికొచ్చాను. అక్కడినుంచి నాలుగు గంటలపాటు ఊపిరాడకుండా బయటి రోగులను చూశాను. అంతసేపూ ఆకలి గుర్తు రాలేదు. మధ్యమధ్యలో వాష్‌రూమ్‌కి వెళ్ళిన విరామంలో కూడా ఆ ముసలావిడే గుర్తుకొచ్చింది. ఆవిడ బాగానే ఉందని నా అసిస్టెంటు వీరభద్ర

ఎంత చెప్పినా భోజనానికి వచ్చేముందు ఆమెను మళ్ళీ స్వయంగా వెళ్లి చూసొచ్చాను. నేను వెళ్లేసరికి ఆమె నిద్రపోతోంది. అంతా బానే ఉందని సంతృప్తి పడ్డాక తిరిగి వచ్చేశాను.

ఇంట్లోకి రాగానే దేవి అడిగిన మొదటి ప్రశ్న, “ఆమెకెలా ఉంది?”

తనెవరి గురించి అడుగుతుందో నాకు తెలిసినా, “ఎవరు? పొద్దున్నుంచి వందమందిని చూశాను. ఎవరి గురించి అడుగుతున్నావు?” అని తెలియనట్టే అడిగాను.

“ఎవరా? ఆంత్రవాహికలో బెజ్జమున్న పేషెంటు. నేను చూపిస్తే తప్ప బెజ్జాన్ని చూడలేకపోయావే, ఆ పేషెంటు” అంది రమాదేవి నవ్వుతూ.

“అవునవును. నువ్వు కలగజేసుకున్నందుకు కృతజ్ఞతలు. ఆవిడిప్పుడు బాగానే ఉంది. ఇబ్బంది కలిగే సూచనలేమీ లేవు” అన్నాను.

“మంచిది. ఐతే ఈ పూట తిండికి ధర్మంగా సంపాదించినట్టే”

“వంటేమిటీ?” అడిగాను డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుంటూ.

“అన్నం, ఆవకాయ పచ్చడి, నీకిష్టమైన టమాటా పప్పు, పెరుగు, మిగలపండిన అరటిపండు.”

“బ్రహ్మాండం. డాక్టరుగారు చెప్పినట్టే చేశావు” అన్నాను నవ్వుతూ.

అన్నంలోకి టమాటాపప్పు, ఆవకాయ కలిపాను. నోరూరుతోంది. ఒక చెంచాతో నెయ్యివేసి చక్కగా కలిసేలా మళ్ళీ కలిపాను. అప్పుడు.. ఒక ముద్ద నోట్లో పెట్టుకున్నాను. ఆహా... ఏమి రుచి. మంచి ఆకలి మీద ఉన్నానేమో త్వరత్వరగా తింటున్నాను.

కాలింగ్ బెల్ మోగింది. దేవి అప్పుడే పళ్ళెం పెట్టుకుంది. ఇంకా వడ్డించుకోలేదు. తలుపు తీయడానికి లేచి వెళ్ళింది. హమ్మయ్య అనుకొని భోజనం కొనసాగించాను.

“మేడం! డాక్టరుగారొకసారి కిందకు రావాలండి. అర్జెంటు” మా కాంపౌండరు శ్రీనివాసరావు గొంతు నత్తినత్తిగా వినిపిస్తోంది.

# 2వ అంకము

## 1950

చల్లనిగాలి వీస్తోంది. నాలుగుతరాలనాటి కుక్కిమంచంలో పడుకొని మబ్బులేని నిర్మలమైన ఆకాశాన్ని చూస్తున్నాడా యువరైతు. భారీవర్షాలు కురిసి వెలిశాక తన పదెకరాల పొలంలో రెక్కలు ముక్కలు చేసుకున్నాడతను. ఆ నులకమంచమే అతనికి పూలపాన్పులా ఉంది. పొలాన రేయింబగళ్ళు చేసిన చాకిరి పూర్తయ్యాక, చావిట్లో మంచమేసుకొని ప్రశాంతంగా పడుకున్నాడతను.

చూపులకు పొట్టిగా బక్కగా ఉంటాడు కానీ, సోమయ్య గట్టిమనిషి. మందిని పోగెయ్యగలడు, ముందుండి నడపనూ గలడు. పద్దెనిమిదేళ్ళ వయసులో క్విట్ ఇండియా ఉద్యమంలో తనగురువు ఆంధ్రకేసరి ప్రకాశంపంతులు నాయకత్వంలో ఒంగోలు రైతు విప్లవాన్ని సోమయ్య ముందుండి నడిపాడు. అప్పటి స్వాతంత్ర్యోద్యమ స్మృతులు అతని మనసులో ఇంకా పచ్చిగానే ఉన్నాయి. ఇప్పుడనిపిస్తుంది. క్విట్ ఇండియా అని గర్జిస్తూ బ్రిటిష్‌వాడి తుపాకులకు ఎదురొడ్డిన దాని ఫలితం ఇదేనా అని. అతనిలాంటి సాహసులు, నిష్కపటుల వల్లనే భారతదేశం స్వాతంత్ర్యాన్ని సాధించగలిగింది. కానీ చిన్న, సన్నకారు రైతుల బతుకులు అప్పటికంటే మెరుగు పడిందేమీ లేదు. భూస్వాములు, దళారులు, వడ్డీవ్యాపారుల కబంధహస్తాలనుండి వాళ్లకు విముక్తి లభించలేదు. సోమయ్యకు సేద్యం వల్ల వచ్చే ఆదాయం స్వల్పం. కానీ కుటుంబాన్ని పోషించడానికి అంతకంటే మార్గం లేదు.

"బాబాయ్! నిన్ను తొందరగా ఇంటికి రమ్మంటున్నారు" రొప్పుతున్న కుర్ర గొంతొకటి సోమయ్య ఏకాంతాన్ని భగ్నం చేసింది.

"ఏమైందిరా సుబ్బా" అని వదిన కొడుకు నడుగుతూ లేచి కూర్చున్నాడు సోమయ్య.

"పిన్నికి పురుడొచ్చిందంట"

"అరె.." అంటూనే చేతికర్ర అందుకొని యింటివైపు పరుగందుకున్నాడు సోమయ్య. వెనకాలే సుబ్బన్న.

ఇంటికి చేరేసరికి పురిటినొప్పులు భరించలేక భార్య వేస్తున్న కేకలు సోమయ్య చెవుల బడ్డాయి. మొహాన పట్టిన చెమట తుడుచుకుంటూ, ఆయాసంతో వగరుస్తూ, భయంతో వణుకుతూ అతను ఇంట్లోకి అడుగుపెట్టాడు. మూడుమైళ్ళు వేగంగా పరుగెత్తినందుకు ఆయాసం, గతంలో ఇద్దరు పిల్లలు పుట్టి, పోయింది తలుచుకొని భయం.

ముసలి మంత్రసాని "తొయ్యమ్మా, తొయ్యి" అంటూ సూచనలిస్తోంది. ఇద్దరు యువతులు అతని భార్యపక్కన కూర్చొని ఆమెని ఊరడిస్తున్నారు. వారిలో ఒకామె అతని భార్యకు అక్క, సుబ్బన్నకు తల్లి. అతను లోపలికి రావడం చూసి, బైటే నిలబడమని కళ్ళతో సైగ చేసిందామె.

సోమయ్య అయిష్టంగానే వెనుతిరిగి బయటకు వచ్చాడు. "బాబాయ్! పిన్నికేం కాదుగా" అని అక్కడే పచార్లు చేస్తున్న సుబ్బన్న అడిగాడు.

గంభీరంగా ఉన్న మొహం మీదికి బలవంతంగా చిరునవ్వు తెచ్చుకుంటూ, "ఏం పర్లేదు నాయనా" అన్నాడు సోమయ్య. సుబ్బన్నంటే సోమయ్యకు చాలా ప్రేమ. బంధుత్వమే కాకుండా ఇంకా చాలా కారణాలున్నాయందుకు. సుబ్బన్న మంచి తెలివిగలవాడు. కష్టపడి పనిచేస్తాడు. నిజాయతీ గల కుర్రాడు. ఒకపక్క పొలంపని చేస్తూనే మరోపక్క కష్టపడి చదువుతాడు. ఏడాది కిందట పొలంలో జరిగిన ప్రమాదంలో అతనితండ్రి చనిపోయాడు. అప్పటినుంచీ అతని బాధ్యత సోమయ్య మీద పడింది.

కుర్రాడిగా ఉన్నప్పుడు సోమయ్యకు చదువుకోవాలని ఉండేది. కానీ అతని ఆర్థికస్థితి అందుకు సహకరించలేదు. సుబ్బన్న సామర్థ్యం చూశాక ఎంత ఖర్చైనాసరే అతన్ని కాలేజీకి పంపి పెద్దచదువు చదివించాలని సోమయ్య నిర్ణయించుకున్నాడు.

# 5వ అంకము

## 1979

ఇన్స్పెక్టర్ అలీ దూసి కొట్టాడు. నేను పరుగెత్తుకుంటూ వెళ్లి వెనక్కు కొట్టగలిగాను. అతను మళ్ళీ దూశాడు. ఈసారి నాకు ఎడమవైపుకి. ఎడమపక్కన నాకు పెద్ద నైపుణ్యం లేదు. అయినా సరే, బ్యాక్‌హాండ్ షాట్‌తో కాక్‌ని తిప్పికొట్టాను. అలీ బలమైనవాడేకానీ చురుకైనవాడు కాదు. ఈ షాట్‌ని తియ్యలేకపోయాడు. నాకు మొదటి పాయింట్ వచ్చింది.

"బ్రహ్మాండంగా ఆడారు డాక్టర్ గారూ!" అంటూ అలీ శాల్యూట్ చేశాడు.

ఇన్స్పెక్టర్ అలీతో షటిల్ ఆడటంవల్ల నాకు మూడందాల లాభం. ఒకటి తను మంచి ఆటగాడు కనుక ఆటలో నానైపుణ్యం కూడా మెరుగుపడుతుంది. రెండోది నగరంలోని విశేషాలన్నీ అతనా సమయంలో నాకు చెప్తాడు. మూడు అతనితో ఆడితే కఠినమైన వ్యాయామం జరిగి శరీరం శక్తి పుంజుకుంటుంది.

ఒక్కోసారి చిన్నచిన్న సంఘటనలే జీవితంలో అతిపెద్ద మార్పుకు దారితీస్తాయి. ఆ రోజు తక్కువగా ఉన్న నా ఆత్మవిశ్వాసాన్ని ఆ మొదటి పాయింటు బలోపేతం చేసింది. దాంతో ఇక వెర్రెత్తినట్టు ఆడి ఇన్స్పెక్టర్ స్కోరును సమం చేశాను. 9-1 తో వెనకబడినవాడిని కాస్తా రిటర్న్ షాట్లు, డ్రాప్ షాట్లు, ప్లేస్‌మెంట్లతో స్కోరుని 14-14 చేశాను. అప్పుడిక అలీ 17 పాయింట్ల గేమ్ ఆడదామని ప్రతిపాదించాడు.

అదే సమయానికి అలీ కోసం ఇద్దరు కానిస్టేబుళ్లు వచ్చారు. కానీ అలీ వాళ్ళతో మాట్లాడే మూడ్‌లో లేదు. "స్టేషన్‌కి పొండి. నేనొక గంటలో వస్తాను" అని వాళ్లకు ఆర్డరేశాడు.

వాళ్ళలో కుర్రకానిస్టేబులేదో చెప్పబోయాడు. వయసులోనూ తెలివిలోనూ పెద్దవాడిగా కనిపిస్తున్న రెండో కానిస్టేబుల్ అతన్ని వెనక్కి లాగేశాడు. ఆటపిచ్చిలో పడకుండా వాళ్ళు చెప్పేదేమిటో ఇన్స్పెక్టర్ అలీ వినున్నట్లయితే తర్వాత పరిస్థితులు మరోలా ఉండేవి.

ఫ్రంట్‌లైన్ సర్వీస్ చేశాను. కాక్ బాక్స్ వైపుగా ప్రయాణిస్తోంది. అది బాక్స్‌లో పడదని అర్థమైన అలీ దాన్ని తీసే ప్రయత్నం చెయ్యలేదు. దైవికంగా అది పోయి లైన్ మీద పడింది. నేను ఉత్సాహంగా కేకలు పెట్టాను. అలీ నావైపు మిర్రి చూస్తూ తర్వాతి సర్వీస్ కోసం కోర్టులో రెండో వైపుకి నడిచాడు. ఇప్పుడు నేను 15–14 ఆధిక్యంలో ఉన్నాను. విజయం నా పిడికిట్లో ఉన్నట్టు అన్పిస్తోంది. గెలవాలనే ఆత్రం వల్ల కావొచ్చు లేదా విధిరాత కావొచ్చు, నా సర్వీసు గురితప్పింది. నేననుకున్న దానికంటే ఎత్తుగా కాక్ గాల్లోకి లేచింది. దాన్ని అలీ ఎంత బలంగా కొట్టాడంటే, అది నా ఎడమవైపు నేలను తాకడం నాకు లీలగా మాత్రమే కనబడింది. ఐతే అలీ ముఖంలో చిరునవ్వేమీ కనిపించలేదు. నేను కాక్ వెనక్కి ఇచ్చాక దాన్నతను బాక్‌లైన్ కి సర్వీస్ చేశాడు.

నేను చురుగ్గా వెనక్కి నడిచి ఒక ఫ్లాట్ షాట్ ని అతని కుడివైపుకి కొట్టాను. అలాంటివి తనకి నీళ్ళ చెర్లాట. అలీ మెత్తగా ఆ షాట్‌ని వెనక్కి నెట్టాడు. అది నెట్ కు దగ్గర్లో నా కోర్టులో పడింది.

“గొప్పగా డ్రాప్ చేశావు” అన్నాను కానీ అలీ అందుకేమీ ప్రతిస్పందించ లేదు. తను కోర్టులో రెండోవైపుకు జరుగుతూ నేను కూడా పొజిషన్ మార్చుకొనేదాకా ఎదురు చూశాడు.

స్కోరిప్పుడు 15–15. నేను కుడిపాదం ముందుకు వేసి ఉంచాను. కానీ బరువంతా ఎడమకాలిమీద ఉంచి వెనక్కి కదలడానికి కూడా సిద్ధంగా ఉన్నాను. కానీ ఈసారి అలీ ఫ్రంట్ లైన్ దగ్గరలోకి సర్వీస్ చేశాడు. నేను దాన్ని సకాలంలో అందుకోలేకపోయాను. 16–15తో అలీ ఆధిక్యంలోకి వచ్చాడు.

ఇన్స్పెక్టర్ అలీ మళ్ళీ సర్వీస్ చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాడు. కానీ నాకు కొద్దిగా విరామం కావాల్సి వచ్చింది. వెనక్కి నడుస్తూ గుండెల్నిండా ఊపిరి పీల్చి వదుల్తూ వత్తిడి తగ్గించుకొంటున్నాను. అలా నిదానంగా ఒక నిమిషం గడిపి

# 6 వ అంకము

## 1963

**మూ**డిట్లోకీ ఎత్తైనదీ శాంతంగా ఉండేదీ ఆవు ఒక్కటే. పొట్టిగా దిట్టంగా ఉండే గేదెలు రెండూ కూడా పోట్లగొడ్లు కాదు గానీ వాటికి తేలిగ్గా రెచ్చిపోయే గుణం ఉంది. పొడుగాటికర్ర చేతబట్టుకొని వాటి కదలికల్ని జాగ్రత్తగా గమనించుకుంటూ వాటితోపాటే నడుస్తున్నాను. జొన్న, మొక్కజొన్న చేల దగ్గర మరింతగా ఒళ్ళు దగ్గర పెట్టుకొని ఉన్నాను. ఐతే, అవి పొగతోటలమీద పడతాయని మాత్రం ఊహించలేదు. నా అంచనా ఘోరంగా తప్పింది. పదెకరాల పొగతోట అది. అక్కడ నా పాలుమాలిక కనిపెట్టి గేదెలు రెండూ చేలోపడి ఏపుగా పెరిగిన పొగమొక్కల్ని కుళ్ళగించడం మొదలెట్టాయి.

నేను వాటిని గట్టుకు మళ్ళించడానికి చేలోకి పరుగెత్తాను. అప్పటికే వాటిని బయటికి తోలమని ఎవరో మనిషి అరుస్తున్నాడు. నేను చేలోకి పోగానే నాఖర్మ కొద్దీ ఆవు కూడా మొక్కల్ని చిందరవందరగా తొక్కుతూ నావెనకే చేలో పడింది.

“కృష్ణా, నీ గొడ్లని చేలోంచి బయటికి తోలు” అని కేకలు పెడుతూ రైతు పరుగెత్తుకొస్తున్నాడు. గేదెల కిదేమీ పట్టలేదు.

“తోల్తున్నాను వెంకన్నా” అని నేను తిరిగి కేకేసాను.

వెంకన్న మా పొరుగువాడే. సాయంత్రం ఊళ్ళో పెద్ద రచ్చే జరుగుతుందని నాకు నిశ్చయమై పోయింది. వెంకన్నది కూడా సుబ్బన్న వయసే గానీ, సుబ్బన్నకంటే ఇతను బలిష్టంగా ఉంటాడు. ముక్కుమీద కోపం. చేపాటి కర్రనెత్తి గేదెల్ని కొట్టబోతున్నప్పుడు అతని ముఖంలో రౌద్రాన్ని నేను స్పష్టంగా చూశాను. ప్రమాదాన్ని

పసిగట్టి ఒకగేదె బయటకి పరుగెత్తింది కానీ రెండోది మాత్రం నిర్లక్ష్యంగా అలాగే ఉండిపోయింది. వెంకన్న కర్రదెబ్బ దాని మెడమీద పడింది. ఆ దెబ్బ తిన్నాక ఇది కూడా మొదటిదానిలాగే బయటికి పరుగెత్తుతుందనుకున్నాను. కానీ అది అలా చేయలేదు. తలవంచి బుసలుకొడుతూ గిట్టలతో నేలగీరుతూ వెంకన్నమీద దాడికి సిద్ధపడింది. అలాంటిస్థితి ఏర్పడినప్పుడు తర్వాత పరిణామం ఎంత దారుణంగా ఉంటుందో నాకు తెలుసు. "హేయ్ ఆగు ఆగు" అని అరుస్తూ నేను దాని దగ్గరికి పరుగెత్తడం మొదలెట్టాను. దున్నిన నేల మీద కాలుకు పట్టు చిక్కట్లేదు.

నేను ఎంత ప్రయత్నం చేసినా పరిస్థితిలో మార్పులేదు. ఇది చాలదన్నట్టు ఈ గోలంతా చూసి ఆవుకూడా చేలోకి పరుగెత్తుకు వచ్చింది. అది నా పక్కనుంచే పరుగెత్తడంతో దాని పొట్టకు తగిలి నేను కిందపడ్డాను. అదృష్టం బాగుండి తప్పింది కానీ లేకపోతే దాని వెనకకాళ్ళ దెబ్బకు పచ్చడై పోదును. అదే సమయానికి వెంకన్న బాధతో అరిచిన అరుపు నాచెవుల బడింది. అప్పుడు నేను చూసిన దృశ్యం ఎప్పటికీ మరిచిపోలేనంతగా నా మనసులో ముద్రవేసుకు పోయింది.

వెంకన్న గాలిలో వెనక్కు ఎగురుతున్నాడు. గేదె తలవంచి అతన్ని కుమ్మడానికి దూసుకుపోతోంది. కారణం తెలీదు కానీ ఆవుకూడా అటువైపే దూసుకుపోతోంది. వెంకన్న కింద పడగానే గేదె అతన్ని ఇష్టం వచ్చినట్టు కుమ్మేసింది. ఆవు జోక్యం చేసుకొనే కొద్దీ పరిస్థితి ఇంకా విషమించింది.

నేను లేచి అక్కడికి పోయి కర్రతో గేదెని బాదేశాను. దాంతో గేదె కోపం వెంకన్న మీదనుంచి నామీదకు మళ్ళింది. అది నావైపు ఉగ్రంగా చూసింది. నేనుకూడా చూపుతిప్పకుండా దానివైపే చూశాను. అప్పుడు ఆవు, గేదెకు నాకు మధ్యలో వచ్చి నిలబడింది. దాంతో గేదె మనసు మార్చుకొని అవతలికి వెళ్ళిపోయింది.

నేను వెంటనే వెంకన్న దగ్గరకు వెళ్లి చూశాను. అతను కదలకుండా పడిఉన్నాడు. పోయాడేమోనని భయపడ్డాను. ముక్కుదగ్గర వేలుపెట్టి చూశాను. అమ్మయ్య, బతికే ఉన్నాడు. అక్కడక్కడా కొద్దిగా గీరుకు పోయి కదుములు కట్టడం తప్ప పెద్దగా గాయాలేమీ తగిలినట్లు కనబడలేదు.

అతని భుజాలు పట్టుకొని కుదుపుతూ, "వెంకన్నా, వెంకన్నా లే" అని గట్టిగా అరిచాను.

# 7వ అంకము

## 1979

ప్రకృతి మానవజాతితో విసిగిపోయినప్పుడు తన ప్రతాపం చూపడానికి మనుషుల ప్రాణాలు బలికోరుతుందని కొందరు నమ్ముతారు. మిగతా ఇలాంటి సిద్ధాంతాలలాగే ఇది కూడా అర్థరహితమైన సిద్ధాంతం. మనుషులు హేతువు కంటే నమ్మకాలకు ఎక్కువ ప్రాధాన్యం ఎందుకిస్తారో నాకు అర్థం కాదు.

వార్తలు చదివేవాడు బొంగురుగొంతుతో ప్రకటిస్తున్నాడు, "కోస్తాతీర గ్రామాలను చుట్టుముట్టి అనేకమంది ప్రాణాలను బలిగొన్న సముద్ర కెరటాల మీద మంటలు కనిపించాయని జనం చెప్తున్నారు. వరుణదేవతలకు కోపం వచ్చింది. వారి మార్గంలో అడ్డు తగిలిన వారిని ఎవరినీ వదలట్లేదు..."

న్యూస్‌రీడర్ అలా మానవులమీద వరుణదేవుడి కోపం గురించి చెప్తున్నప్పుడు, ఆ మంటలు అగ్నిపర్వతం పేలుడువల్ల వచ్చినవా లేక చూసినవాళ్ళ భ్రాంతా అని నేను ఆలోచిస్తున్నాను. మొత్తానికి ఈ ఆలోచన ఒకవైపు అర్థరహితం గానూ మరోవైపు ఆసక్తి కలిగించేదిగానూ ఉంది.

తుఫాను పుణ్యమా అని ఆస్పత్రి ఖాళీగా ఉంది. నాలుగు రోజులు సుదీర్ఘంగా ఇంట్లోనే కాలక్షేపం చేశాను. ఇంట్లో ఉన్నంతసేపూ ఎక్కువ భాగం డాక్టర్ లియోనార్డ్ నాకు కానుకగా ఇచ్చిన కత్తిని చేతపుచ్చుకు కూర్చున్నాను. డాక్టర్ లియోనార్డ్ చెప్పినట్టు దానికేదైనా తేడా చూపగల శక్తి ఉంటుందా అని ఆలోచించాను.

"పనిలేనప్పుడల్లా ఆ కత్తి పట్టుకొని కూర్చుంటావెందుకు?" అంది దేవి విసుక్కుంటున్నట్టు.

"నాకే తెలియదు. అదంటే నాకు చాలా ఇష్టం. అందుకే పట్టుకొని కూర్చుంటున్నాను. దాన్ని చూసినప్పుడల్లా డాక్టర్ లియోనార్డ్‌గారూ వైద్యశాస్త్రంలో ఆయన నాకు నేర్పిన పాఠాలూ గుర్తుకొస్తాయి."

"ఐతే ఆయన మీకు బాగా ప్రేరణ కలిగించిన మనిషన్నమాట. అవునా?"

"అవును" అన్నాను డాక్టర్ లియోనార్డ్‌తో నేను గడిపిన మంచిరోజులు గుర్తు తెచ్చుకుంటూ.

"ఇతర ప్రొఫెసర్లు నాకు కేవలం వైద్యమే నేర్పారు. డాక్టర్ లియోనార్డ్ అంతకు మించి బోధించారు. మంచివైద్యుడిగా ఉండటమంటే ఏమిటో ఆయన నుంచే నేను నేర్చుకున్నాను."

"సరే! మీ ఆప్యాయతలు నాకు అర్థమయ్యాయి కానీ ఆ కత్తిని అలా తిప్పడం మానెయ్యండి." అంది దేవి సున్నితంగా ఆ కత్తిని నా చేతిలోంచి లాగి సొరుగులో పడేస్తూ.

"వాతావరణం ఎంత బాగుందో చూడు. వర్షం, చలి, ఏకాంతం... నాకైతే ఇదంతా చాలా బాగుంది."

"అవును సుమీ" అన్నాను తనను తేలికగా ముద్దాడుతూ.

నిజానికి నాకు వర్షాలంటే చాలా ఇష్టం. కానీ ఇది వాన కాదు. తుఫాను. ఇల్లంతా నీరు చేరింది. పడకగదిని పొడిగా ఉంచుకోవడానికి మేము చాలా శ్రమించాల్సి వచ్చింది. కరెంటు లేదు. ఐతే దేవి, లేకుంటే రేడియో. ఈ రెండే నాకు కాలక్షేపం. ఇద్దరూ అలుపు లేకుండా మాట్లాడుతూ నాకు విశ్రాంతి లేకుండా చేస్తున్నారు.

చివరికి దేవి అననే అన్నది. తుఫాను వస్తే గానీ నా గొడవ నీకు పట్టలేదు అని. ఆ మాట కొస్తే నిజంగానే నేను దేవితో అద్భుతంగా గడిపింది ఆ నాలుగు రోజులే. చెప్తే తమాషాగా ఉంటది కానీ అంతకుముందు కంటే దేవిని గురించి ఆ నాలుగు రోజుల్లోనే ఎక్కువ తెలుసుకున్నాను.

తుఫాను ముగియగానే ఆస్పత్రిలో రద్దీ పెరిగింది. గాయపడిన కేసులే ఎక్కువగా ఉన్నాయి. హడావిడి తగ్గగానే తుఫాను బాధితుల సహాయక దళంలో పనిచేయాలని నిర్ణయించుకున్నాను. నిజానికి ఆ దళంలో పనిచేయాల్సిన ప్రభుత్వవైద్యుడు డాక్టర్ రమణయ్య ఆ సమయంలో అనారోగ్యం పాలయ్యాడు.

# 8వ అంకము

## 1966

ట్రంకురోడ్డు దిగి మా ఊరు పోయే మట్టిరోడ్డులోకి ప్రవేశించగానే పందెం మొదలైంది. యర్రా గ్రామం నుంచి రోజూ ముగ్గురు పిల్లలం సైకిళ్ళేసుకొని ఒంగోలులోని ఎబియం స్కూలుకు పోయి వచ్చేవాళ్ళం. నేనప్పుడు తొమ్మిదోతరగతి చదువుతున్నాను. మిగిలిన ఇద్దరూ సింగయ్య, బ్రహ్మయ్య ఎనిమిదో తరగతిలో ఉన్నారు. యర్రాకు పోయే మట్టిరోడ్డు లోకి రాగానే సైకిళ్ళాపి ఒకటి, రెండు, మూడు అని లెక్కబెట్టి మూడు అనగానే పందెం మొదలయ్యేది.

సింగయ్య సాధారణంగా ముందు దూసుకుపోతాడు. ఆ వెనకే బ్రహ్మయ్య. గమ్యం ఇంకా ఒక కిలోమీటర్ దూరం ఉందనేంతవరకూ నేను నిదానంగా తొక్కేవాణ్ణి. అక్కడినుంచి పిచ్చివేగం ఎత్తుకొనేవాణ్ని. అనుభవంతో నేను తెలుసుకొన్న విషయమేమంటే అప్పటికి మిగతా ఇద్దరూ బాగా అలసిపోయి నీరసపడేవాళ్ళు. మొదటి రెండుకిలోమీటర్ల దూరం వాళ్ళు వేగంగా వెళ్తుంటే మామధ్య దూరం పెరుగుతూ ఉండేది. నేను కావాలనే వెనకబడేవాడిని. ఐతే వాళ్ళిద్దరూ నా చూపుమేర దాటిపోకుండా చూసుకొనేవాడిని.

రోడ్డు రెండుకిలోమీటర్ల దూరం ఎగుడుదిగుడుగా ఉంటుంది. నేనక్కడ వాళ్లకు, నాకు మధ్య దూరాన్ని తగ్గించుకుంటూ స్థిరమైన వేగంతో నడిపాను. సిమెంటురోడ్డు చేరేసరికి బ్రహ్మయ్యని దాటేశాను. సింగయ్య నాకంటే ఇంకా 50 మీటర్ల దూరం ముందున్నాడు. వేగంగా పోతున్నాడు. ఇదివరకట్లాగా అతను అలసిపోలేదు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Aana**

* * *